క్లుప్తంగా

పాఠశాల స్థల ఆక్రమణపై ఫిర్యాదు

బంగారుపాళెం: మండలంలోని కీరమంద గ్రామంలో పాఠశాలకు సంబంధించిన ప్రభుత్వ స్థలం దురాక్రమణపై సోమవారం సర్పంచ్ రాజా, గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలో గల దేవరగుట్ట వద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మించడం జరిగిందన్నారు. ఇటీవలే పాఠశాల అప్‌గ్రేడ్ అయిందన్నారు. పాఠశాలకు క్రీడామైదానం, ప్రజా అవసరాల నిమిత్తం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు స్థలం అవసరం ఉందన్నారు. పాఠశాల పక్కనే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎకరా స్థలం ఆక్రమించుకున్నాడన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చేపల చెరువుకు వేలం నిర్వహించాలని వినతి



బంగారుపాళెం: ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు గ్రామం చిల్లామల్లయ్య చెరువుకు చేపలు పట్టుకునేందుకు వేలం నిర్వహించాలని మాజీ సర్పంచ్ విజయకుమార్, గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓ మహేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని చిల్లామల్లయ్య చెరువులో చేపలు పట్టేందుకు వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జనవరి నుంచి జూలై వరకు చేపలు పట్టేందుకు లీజు హక్కును పంచాయతీ అధికారులు కల్పించారు. అయితే లీజు గడువు ముగిసినా సంబంధిత వ్యక్తి నిబంధనలకు వ్యతిరేకంగా చేపలు పడుతున్నట్లు తెలిపారు. చెరువుకు వేలం నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. వేణుగోపాల్‌రెడ్డి, శివారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి



నూతన ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు, ఎంఈఓ

యాదమరి: కొత్తగా ఉద్యోగంలో చేరిన నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి విద్యార్థులకు బోధన చేయాలని ఎంఈఓ రుక్మిణి సూచించారు. సోమవారం ఆమె స్థానిక ఎంఈఓ కార్యాలయంలో 2025 డీఎస్సీ ద్వారా కొత్తగా ఎంపికై మండలానికి వచ్చిన ముగ్గురు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తగిన ప్రణాళికలు రచించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం నూతన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. వీరికి పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకాచారి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంపిళ్లై, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపుతాం



మురుగు నీటిని పరిశీలిస్తున్న కార్యదర్శి

ఐరాల: మండల కేంద్రంలోని న్యూకాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని నాగంవాండ్లపల్లె పంచాయతీ కార్యదర్శి మాధవి తెలిపారు. సోమవారం న్యూ కాలనీలో డ్రైనేజీలు లేకపోవడంతో సీసీ రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండడాన్ని ఆమె పరిశీలించారు. ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వతో తాము అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు విన్నవించారు. కాలనీలో డ్రైనేజీలు లేనందున మురుగు నీరు రోడ్లపై వదలకుండా ఇంటి యజమానులు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని తెలిపారు. ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లి త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 32 మంది ఎంపిక



బంగారుపాళెం: కళ్లను పరీక్షిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 20 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 43 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 20 మందికి ఆపరేషన్లు అవసరం కావడంతో, వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

నారా మద్యం.. నారీ యుద్ధం

- గ్రామాల్లో పేదల బతుకులు బుగ్గవుతున్నాయ్..
- కూటమి ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- నిరసన ర్యాలీల్లో సమన్వయకర్తలు విజయానందరెడ్డి, సునీల్‌కుమార్.

చిత్తూరు అర్బన్: ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం తయారీ.. రాష్ట్రం మొత్తం సరఫరా అయిందని, అది తాగిన అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి స్వామి వివేకానంద విగ్రహం నుంచి రైల్వే అండర్‌బ్రిడ్జి మీదుగా ఎక్సైజ్ అర్బన్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట మహిళలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. స్టేషన్ వెలుపల పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసి నారావారి నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊరూరా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసి, ఇక్కడ నకిలీ మద్యం సరఫరా చేశారని ఆరోపించారు. నకిలీ మద్యంతో వచ్చిన లాభాలు ప్రభుత్వ పెద్దలు సైతం పంచుకున్నారన్నారు. ఇందులో వాస్తవాలు తెలియాలంటే కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులను వీడియోలు తీస్తూ పోలీసులు హల్‌చల్ చేశారు. కొందరు పార్టీ కార్యకర్తలు తమను ఎందుకు వీడియోలు తీస్తున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిరసనలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు లక్ష్మణస్వామి, మధురెడ్డి, భాగ్యలక్ష్మిరెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలిరెడ్డి, జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు హరీషారెడ్డి, నగర పార్టీ నాయకులు మనోజ్‌రెడ్డి, టిమ్ము, దొడ్డిపల్లె శివ, అను, కృష్ణమూర్తి, నారాయణ, కృష్ణారెడ్డి, సర్పంచ్ రజనీకాంత్, రూరల్ మండల నాయకులు త్యాగరాజులు, ప్రతిమారెడ్డి, జయరామ్, సుదర్శన్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.



నకిలీమద్యం నియంత్రించాలని నిరసన చేస్తున్న విజయానందరెడ్డి, పార్టీ శ్రేణులు



ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నాయకులు

కల్తీ కేటుగాళ్లను అరెస్టు చేయండి

కాణిపాకం: విచ్చలవిడిగా నకిలీమద్యం విక్రయిస్తుండడంతో పేదల బతుకులు ఛిద్రమవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు చిత్తూరు నగరంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని నినాదాలతో హోరెత్తించారు. నకిలీమద్యం తయారీదారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊరూరా బెల్టుషాపులు పెరిగిపోయాయన్నారు. పల్లెల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. పెద్దలతో పాటు యువత కూడా మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో విక్రయిస్తున్న మద్యంలో ఏదీ ఒరిజినల్.. కల్తీయో.. ప్రజలకు తెలియక, అది తాగిన వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందన్నారు. నకిలీ మద్యం భారీగా పట్టుబడిన ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నకిలీమద్యం కేటుగాళ్లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు రామచంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి, హరిరెడ్డి, నాయకులు ఎంబీ కుమార్ రాజా, శిరీష్ రెడ్డి, దత్తాత్రేయ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, పాలాక్షి రెడ్డి, రెడ్డెప్ప, అను, రఘుపతి రాజ్, రామచంద్ర, గజేంద్ర, నాగరాజ, శైలేష్, పాల్‌రాజ్, ప్రతాప్ రెడ్డి, చిన్నారెడ్డి, మోహన్ రెడ్డి, సుభేష్ రెడ్డి, సాయి రెడ్డి, ఓబుల్ రెడ్డి, రమణ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం వల్లే వరద ముప్పు

- ఎన్నికలప్పుడు బ్రిడ్జి కట్టిస్తామని చెప్పి నేటికీ పట్టించుకోని వైనం
- వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ చిత్తూరు సమన్వయ కర్త విజయానందరెడ్డి
- చిత్తూరు వీరభద్ర కాలనీ ప్రాంత ప్రజలకు తక్షణ సాయం
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే బ్రిడ్జి కట్టిస్తామని హామీ



మాట్లాడుతున్న చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో నీవానది పరివాహక ప్రాంతాల్లో బ్రిడ్జి కట్టిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతున్నా పట్టించుకోలేదని.. చివరకు ముప్పు వచ్చేలా చేసి జనాన్ని మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి మండిపడ్డారు. ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి నీవానది పరివాహక ప్రాంతం ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు కుటుంబాలు వరద ముప్పునకు గురయ్యాయి. చాలామంది ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన సోమవారం ఉదయం వరద ప్రవాహ ప్రాంతంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తానున్నానని భరోసా కల్పించారు. అనంతరం విజయానందరెడ్డి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతం ముప్పునకు గురైతే తాము వెంటనే స్పందించామన్నారు. స్థానికులకు సురక్షిత ప్రాంతాలకు తరలించి అన్ని వసతులు కల్పించామన్నారు. పాఠశాలలో వసతి ఏర్పాటు చేసి దుస్తులు, నిత్యావసర సరుకులు, భోజనం తదితర అవసరాలను దగ్గర ఉండి చూసుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలకు ఎన్నికలప్పుడు ముప్పు వాటిల్లకుండా బ్రిడ్జి కట్టిస్తామని చెప్పి.. నేటికీ పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు.

బ్రిడ్జి కట్టించే బాధ్యత మాదే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బ్రిడ్జి కట్టించే బాధ్యతను తాను తీసుకుంటానని వరద బాధితులకు హామీ ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల వాసులకు వసతి కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ముందుంటుందని ఆయన స్థానికులకు కొండంత భరోసా ఇచ్చారు. ఇక్కడ ఇబ్బందికరంగా ఉంటే కల్యాణ మండపం ఉందని.. అందరూ అక్కడకు వచ్చేయాలని సూచించారు. భోజనంతో పాటు అన్ని వసతులు తాను చూసుకుంటానని.. భయపడవద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, నాయకులు ఆను, అల్తాఫ్, వెంకటేష్, జగ్గ ఉన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



ఆర్డీఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : టపాసుల విక్రయాలకు కచ్చితంగా అనుమతులు ఉండాలని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో పలు శాఖల అధికారులు, టపాసుల విక్రయదారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగ నిర్వహించుకోవాలన్నారు. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, శాంతిభద్రతలకు ఇబ్బందులు కలుగకుండా పండుగ నిర్వహించుకోవాలన్నారు. అనుమతులు లేకుండా టపాసులను విక్రయిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని మామిడికాయల మండీలో టపాసులను విక్రయాలకు అనుమతులు ఇచ్చామన్నారు. నిబంధనలు పాటిస్తూ దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ సాయినాథ్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్, వన్‌టౌన్ సీఐ మహేశ్వర్, ఏడీ మార్కెటింగ్ పరమేశ్వర్, చిత్తూరు అర్బన్, రూరల్ తహసీల్దార్లు కులశేఖర్, జయప్రకాష్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



మందు నిల్వలు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి రెడ్డెప్ప

ఐరాల: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్లలో విధులు నిర్వహించే వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప ఆదేశించారు. సోమవారం నాంపల్లె సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి హాజరు రిజిస్టర్, మందుల నిల్వలు, ఆరోగ్య పథకాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఎంఎల్‌హెచ్‌పీలో సకాలంలో విధులకు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌సెంటర్ వద్ద నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులకు టీకాలు విధిగా వేయించాలని సూచించారు. ఆవరణలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను వెంటనే మంజూరు చేయాలని ఏఐటీయూసీ, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి చంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కొన్ని ఆస్పత్రుల్లో 50 ఏళ్ల ఉన్న కార్మికులను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. గౌరవ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ మూడు నెలల పెండింగ్ జీతాల సమస్యను వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం స్పందన లేదన్నారు. మూడు నెలల జీతాలు ఇవ్వకపోతే కార్మికులు ఎలా కుటుంబాలను పోషించుకోవాలని ప్రశ్నించారు. కలెక్టర్ చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో సంఘ నాయకులు కోదండయ్య, రఘు, రమాదేవి, జయకుమారి, లత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ

చిత్తూరు అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ఆరోగ్యాధికారి(ఎంహెచ్‌ఓ) డా.లోకేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, తీసుకోవాల్సిన చర్యలపై వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యదర్శులు, మలేరియా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్‌వైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల వెల్లువ

చిత్తూరు అర్బన్: ప్రజా పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే వినతులు, సమస్యలను సకాలంలో పరిష్కరించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాద్ ఆదేశించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు

గుడుపల్లె: మండలంలో మల్దేపల్లిలో వెలసిన చౌడేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మహా కుంభాభిషేకం, మహామంగళహారతి ఇచ్చారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. రాత్రి సాంస్కృతి, కార్యక్రమాలు నిర్వహించారు.

స్వదేశీ ఉత్పత్తులే వినియోగిద్దాం



మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ నేపథ్యంలో స్వదేశీ వస్తువుల వినియోగాన్ని పెంచాలని చిత్తూరు మేయర్ అముద పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక సంస్థ, పరిశ్రమల శాఖ, లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో 'జీఎస్టీ 2.0 సంస్కరణలు, భవిష్యత్ ఆర్థిక ధోరణలు' అనే అంశంపై మహిళలకు సోమవారం నగరపాలక కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. జీఎస్టీ 2.0 ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులను తగ్గించి ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు చేశాయన్నారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మహేష్ కుమార్, కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు(యాదమరి): మన దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలంటే ప్రతి ఇంటా స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దామోదరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యులు భానుప్రకాష్‌తో కలసి ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటా స్వదేశీ-ఇంటింటా స్వదేశీ కార్యక్రమాన్ని ప్రతీ గడపకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీతి ఆయోగ్ బృందం సర్వే

చౌడేపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీపై నీతి ఆయోగ్ బృందం సభ్యులు సోమవారం సర్వే చేశారు. మండలంలోని లద్దిగం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల ఎత్తుకు తగినట్టు బరువు ఉన్నారా లేదా అని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై ఇంటింటికీ వెళ్లి విచారించారు.

ముంచుకొస్తున్న వరద ముప్పు



జొన్నావాళ్లమిట్టలో స్తంభించిన రాకపోకలు



యాదమరి వరదరాజుల స్వామి ఆలయ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీవానది

యాదమరి: మండలవ్యాప్తంగా ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పల్లెలు చిగురుటాకులా వణికాయి. మరోవైపు చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అయితే అన్నదాతలు పొలాల్లో బోర్లలో నీటమట్టం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తుండగా..మరోవైపు చేతికొచ్చిన పంటలు నీట మునగడంతో నష్టం వాటిల్లి మరికొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీవానదికి వరద నీరు భారీగా చేరడంతో వరదరాజస్వామి ఆలయ సమీపంలో నిర్మించిన వంతెన మార్గం దెబ్బతిని ప్రమాదకర స్థితికి చేరుకుంది. కీనాటంపల్లి కొత్తచెరువు నిండి మొరవ పారడతో జొన్నావాల్లమిట్టకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జోడిచింతలలోని రాధమ్మకు చెందిన రేకుల ఇల్లు కూలడంతో ఆస్తి నష్టం వాటిల్లింది. ఎస్ఐ ఈశ్వర్, తహసీల్దార్ పార్థసారధి పలు చెరువులు, రహదారులను పరిశీలించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



జోడిచింతలలో కూలిన ఇల్లు